రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్
- వరి కొనుగోలు కేంద్రాల తనిఖీ

మాగనూర్‌లో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఊట్కూర్, నవంబర్ 5 : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె మండలంలోని తిప్రాస్‌పల్లి శివారులోని విజయకాటన్ ఇండస్ట్రీలో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. తేమ శాతాన్ని పరీక్షించి రైతులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. తూకాలు, రైతు వేలిముద్రతో కూడిన ఆధార్ అనుసంధానం, ఓటీపీ విధానాన్ని కంప్యూటర్‌లో పరిశీలించారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, మార్కెట్ కార్యదర్శి భారతి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి..

మాగనూరు/కృష్ణ, నవంబర్ 5 : రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం మాగనూరు, కృష్ణ ఉమ్మడి మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం కృష్ణలో సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్, సివిల్ సప్లయ్ డీఎం దేవదాస్, డీఎస్‌వో సుదర్శన్ తదితరులు ఉన్నారు.

మాతృమరణాల నివారణకు చర్యలు తీసుకోవాలి

నారాయణపేట టౌన్, నవంబర్ 5 : జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి మాతృ మరణాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో మాతృమరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఎన్‌సీ చెకప్ సమయంలో గర్భిణులు ఎలాంటి ఆరోగ్య సమస్యలు చెబుతారని ఏఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ కాలంలో వచ్చే ప్రమాద సంకేతాలను ఏఎన్ఎంలకు, ఆశ కార్యకర్తలకు వివరంగా తెలియజేయాలని మెడికల్ ఆఫీసర్‌లకు సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి, డాక్టర్ శైలజ, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలును వేగవంతం చేయాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్రలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర, నవంబర్ 5 : ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి కొనుగొలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. సన్న రకం వడ్లకు 40 శాతం, దొడ్డు రకానికి 30 తేమ శాతం ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో రాజేంద్ర అగర్వాల్, సహకార సంఘం సీఈవో శ్రీనివాసులు, రైతులు తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి..

చిన్నచింతకుంట, నవంబర్ 5 : కురుమూర్తి స్వామి జాతరలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. మంగళవారం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలను పరిశీలించారు. శుభ్రత పాటించడంతోపాటు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అన్నాసాగర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, నవంబర్ 5 : రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని అన్నాసాగర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి మద్దతు ధరతోపాటు క్వింటాకు బోనస్ రూ.500లు ఇస్తున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని బయటి వ్యక్తులకు కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే అమ్మాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ రెహమాన్, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు హర్యానాయక్, లక్ష్మీకాంత్ రెడ్డి, వెంకట్రాములు పాల్గొన్నారు.

పీఆర్సీ, డీఏలను విడుదల చేయాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబర్ 5 : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నాయకులు ధర్మాగ్రహ దీక్షను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు బొల్లం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కమిషన్ నివేదికను విడుదల చేసి వెంటనే పీఆర్సీని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల జీపీఎఫ్ మెడికల్, సరెండర్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాబునాయుడు, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్‌గౌడ్, కర్ణాకర్‌గౌడ్, జిల్లా కోశాధికారి రాజమోహన్‌రెడ్డి, చలపతి, నాగేశ్వర్‌రెడ్డి, తాహెరాబేగం, మల్లీశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్ష

నారాయణపేటరూరల్, నవంబర్ 5 : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం ఉద్యమాల ద్వారానే సాధ్యమని రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డిలు అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్కు వద్ద ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం తపస్ ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్ష నిర్వహించారు. పెండింగ్ డీఏల విడుదల, నూతన పీఆర్సీ ప్రకటన, సీపీఎస్ విధానం రద్దు, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని తదితర డిమాండ్‌ల పరిష్కారానికి దీక్ష చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నర్సింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరుస దాడులు ప్రభుత్వానికి పట్టవా?

ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 5 : మహిళలు, చిన్నారులపై పాలమూరులో వరుస దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, హోం మంత్రి లేకపోవడం సిగ్గుచేటని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీశ్ అన్నారు. పాలమూరులో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ కూడలిలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పది రోజుల కిందట రెండో పట్టణ పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే దాడి చేశారని, ఆ ఘటన మరవకముందే మూడేళ్ల చిన్నారిపై పిస్తాహౌస్‌లో పనిచేసే ఒక వ్యక్తి దాడి చేయడం దారుణమన్నారు. నిందితుడి మానసిక స్థితి సరిగా లేదని పోలీసులు చెప్పడం బాధాకరమన్నారు. వ్యాపార సంస్థల యజమానులతో సమావేశం నిర్వహించి సూచనలు చేయాలన్నారు.

స్విమ్మింగ్‌పై ఆసక్తి చూపాలి

- తెలంగాణ ఓపెన్ వాటర్ స్విమ్మర్ క్వీన్ విక్టోరియా

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 5 : క్రీడాకారులు, యువతీ యువకులు స్విమ్మింగ్‌పై ఆసక్తి చూపాలని తెలంగాణ మహిళా ఓపెన్ వాటర్ స్విమ్మర్ గంధం క్వీన్ విక్టోరియా అన్నారు. తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు జితేందర్‌రెడ్డి సూచనల మేరకు మంగళవారం స్టేడియం మైదానంలో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌ను డీవైఎస్‌వో శ్రీనివాస్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విక్టోరియా మాట్లాడుతూ తాను 43 ఏండ్ల వయస్సులోనే ఈజిప్ట్ రాజధాని కైరో వేదికగా జరిగిన స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ మహిళల 400 మీటర్ల విభాగంలో రెండోస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ చేజిక్కించుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువత స్విమ్మింగ్‌లో పాల్గొనేలా అవగాహన కల్పించి శిక్షణను అందించాలని సూచించారు.

బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 5: బ్యాంకులు మంజూరు చేసే రుణాలు సద్వినియోగం చేసుకోవాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ కల్యభాస్కర్ సూచించారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జన శిక్షణా సంస్థాన్ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ నైపుణ్య శిక్షణ కార్యక్రమం 7వ బ్యాచ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ రుణాలపై అవగాహన కల్పించారు.

ఇద్దరు నిందితులకు రిమాండ్

మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

మరికల్, నవంబర్ 5 : ఇంటికి తాళం వేసి ఉంటే చాలు ఆ ఇంట్లో చోరీ చేయడమే పనిగా పెట్టుకున్న ఇద్దరు నిందితులను మంగళవారం మరికల్ పోలీసులు పట్టుకునట్లు నారాయణపేట డీఎస్పీ లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మక్తల్ మండలం చందాపూర్ గ్రామానికి చెందిన తమ్మారెడ్డి నర్సింహులు, అలాగే వడ్వాట్ గ్రామానికి చెందిన కె.నర్సింహులు కలిసి మరికల్ మండల కేంద్రంలోని మూడవత్ హన్మంతు ఇంట్లో మూడు మాసల బంగారు కమ్మలు, 20 తులాల వెండి, అలాగే బంగారు గాజులు, బుట్టకమ్మలు, ఉంగరం, చైన్, బంగారు గుండ్లు, ఐదువేల నగదు, పుసల్‌పాడ్ గ్రామంలో బంగారు కమ్మలు, బుట్టలు, వెండి వస్తువులు, రూ.20వేలు నగదు చోరీ చేసినట్లు ఆయన తెలిపారు. వీరిని పోలీసులు తిరుపతిరెడ్డి, రవీందర్‌లు పట్టుకొని విచారించగా మరికల్, పుసల్‌పాడ్ గ్రామాల్లో తాళం వేసిన ఇండ్లలో చోరీ చేసినట్లు చెప్పడం జరిగిందని డీఎస్పీ పేర్కొన్నారు. వారి ఇంటి వద్ద పోలీసులు తనిఖీ చేయగా ఐదున్నర తులాల బంగారు, 35 తులాల వెండి వస్తువులు దొరికినట్లు చెప్పారు. వాటి విలువ దాదాపు రూ.3.71లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్సై మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యతలేని భోజనం పెట్టొద్దు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, న వంబర్ 5 : వసతి గృహ విద్యార్థులకు నా ణ్యమైన భోజనం అందించడం లేదని కేవీపీఎస్ జిల్లా కమిటీ నాయకులు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సాంఘిక సం క్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుదర్శన్‌కు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కేవీపీఎస్, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు చేసిన పోరాటాల ఫలితంగా మెనూ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందన్నారు.

పురాతన సంపదను కాపాడుకోవాలి


కప్పెటలో వినాయక విగ్రహాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

భూత్పూర్, నవంబర్ 5 : పురాతన సంపదను కాపాడుకోవాలని పురావస్తు శాఖ పరిశోధకుడు శివనాగిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాత కప్పెటలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో 16వ శతాబ్దపు కాలం నాటి(విజయనగర రాజుల) గణేశుడి విగ్రహం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కాకతీయుల కాలం నాటి శివాలయాన్ని పున:నిర్మాణం చే స్తుండగా, గ్రామస్తుల విన్నపం మేరకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. మూడుడగుల వెడల్పు, మూడడుగుల ఎత్తున వినాయక విగ్రహం లభ్యమైందన్నారు. 400సంవత్సరాల కిందటి నాటిదని తెలిపారు.

టై, బెల్ట్‌ల అందజేత

మిడ్జిల్, నవంబర్ 5 : ప్రభుత్వ పాఠశాలల బలోతానికి కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిల్వేర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మాజీ సర్పంచ్ సంయుక్తరాణి, నాయకులతో కలిసి టై, బెల్ట్‌లను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

భూత్పూర్, నవంబర్ 5 : పిల్లల సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రబ్బు అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా-డే సందర్భంగా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

కాంగ్రెస్ మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా?

నాయకులంతా కుర్చీల్లో కూర్చోగా, నిల్చున్న మహిళా సంఘం అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు

దేవరకద్ర, నవంబర్ 5 : పదవిలో ఉన్న మహిళలను కాంగ్రెస్ నేతలు అవమానించడం సిగ్గుచేటని మాజీ సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాయపల్లిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా వద్ద మహిళా సంఘం అధ్యక్షురాలు వెంకటమ్మ, ఉపాధ్యక్షురాలు అలివేలమ్మతోపాటు కాంగ్రెస్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు హాజరయ్యారన్నారు. కాగా, అధికార పార్టీ నేతలంతా కుర్చీలపై కూర్చొని అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలిని నిలబెట్టి అవమానించడం తగదన్నారు.

హోరాహోరీ పోరులో పాలమూరు విజయం

విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 5 : వరంగల్‌లోని టీవీవీ క్రికెట్ గ్రౌండ్‌లో హెచ్‌సీఏ అండర్-23 బాలుర అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగింది. మంగళవారం వరంగల్ జట్టుపై మహబూబ్‌నగర్ జట్టు 9 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 22.3 ఓవర్లలో 81 పరుగులు చేసి ఆలౌట్ కాగా, జట్టులో షాదాబ్ హమీద్ 25 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన వరంగల్ జట్టు 26.3 ఓవర్లలో 72 పరుగులు చేసి ఓటమి పాలయ్యింది. మహబూబ్‌నగర్ జట్టు బౌలర్ ముఖిత్ ఉద్దీన్ 8 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

సాయి సమీక్ష

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 5 : మహబూబాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఆర్చరీ కంపౌండ్-14 విభాగంలో జిల్లా క్రీడాకారులు సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ పోటీల్లో సాయి సమీక్ష బంగారు పతకం సాధించగా, గౌతమ్‌రెడ్డి 4వ స్థానంలో నిలిచాడు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి ఆర్చరీ పోటీలో వీరు పాల్గొంటారని కోచ్ జ్ఞానేశ్వర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

శాంతి

నవాబ్‌పేట, నవంబర్ 5 : మండలంలోని పో మాల ఉన్నత పాఠశాల విద్యార్థిని శాంతి డిస్కస్ త్రో పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జీహెచ్ఎం వెంకట్రాములు మంగళవారం తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన డిస్కస్ త్రో పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా పీఈటీ ఖాజామైనొద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 5 : విద్యార్థులు, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ క్రికెట్ మైదానంలో జలజం సత్యనారాయణ క్రికెట్ టోర్నీలో ఫైనల్ మ్యాచ్‌ను నిర్వాహకులతో కలిసి తిలకించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

రైతులకు అందుబాటులో కేంద్రాలు

మిడ్జిల్, నవంబర్ 5 : రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూర్, వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి, ఇల్వేర్, వాడ్యాల్, వేముల, బోయిన్‌పల్లిలో ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

జడ్చర్ల, నవంబర్ 5 : జడ్చర్లలో పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్ పాల్గొని కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

మహ్మదాబాద్, నవంబర్ 5 : యువత డ్రగ్స్, గంజాయి, మత్తుకు బానిసలు కాకుండా ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందని రిటైర్డ్ డీఈవో విజయ్ కుమార్ అన్నారు. సత్యశోధన పాదయాత్రలో భాగంగా మంగళవారం మండల కేంద్రానికి చేరుకొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గాంధీ జయంతి రోజు అలంపూర్ నుంచి సత్యశోధన పాదయాత్ర ప్రారంభమైందన్నారు.

ఎన్టీఆర్ కళాశాలలో విత్తన ప్రదర్శన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 5 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం విత్తన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ హాజరై మాట్లాడుతూ ఆహారభద్రతలో విత్తనాల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఎన్నో పోషక విలువలతో కూడిన విత్తనాలు మారుతున్న జీవనశైలికి అనుగుణంగా వచ్చే వ్యాధులను నివారించడంలో ఉపయోగపడతాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ అమీనా ముంతాజ్ జహాన్ అరుదైన మొక్కలు, ఆహారధాన్యాలు, చిరుధాన్యాలు, ఔషధ, పండ్ల మొక్కలకు సంబంధించిన విత్తనాలను జాగ్రత్తగా భద్రపరిచి వాటిని భవిష్యత్ తరాలకు అందించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మ, అనురాధ, వృక్షశాస్త్ర విభాగ అధ్యాపకులు సుధీర్, శ్రీవాణి, శ్వేతారాణి, త్రివేణి, సుకీర్తి, వివిధ విభాగాల అధిపతులు మద్దిలేటి, ఇమ్మానుయేల్, సుధాకర్‌రెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

నవాబ్‌పేట, నవంబర్ 5 : మండల కేంద్రంలోని కురిహినిశెట్టి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

డీఎంహెచ్‌వోకు సన్మానం

మహబూబ్‌నగర్, నవంబర్ 5 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా కృష్ణ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు కొండా పురుషోత్తంరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

కస్టమర్లు అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట, నవంబర్ 5 : బ్యాంక్, ఏటీఎంల వద్ద ప్రతిరోజూ లావాదేవీలు జరిపేందుకు వచ్చే కస్టమర్లు అప్రమత్తంగా ఉండాలని సీఐ శివశంకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌బీఐ, యూనియన్, కెనరా బ్యాంక్ పరిసరాల్లో ఫింగర్ ప్రింట్ డివైస్‌తో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా సరాఫ్‌బజార్, సెంటర్ చౌక్, బంగారు దుకాణాల వద్ద పోలీసులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

మాగనూర్, నవంబర్ 5 : మద్యం తాగి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అశోక్‌బాబు హెచ్చరించారు. మాగనూరులో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు.

పీఎస్ ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బాలానగర్, నవంబర్ 5 : బాలానగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ కథనం మేరకు.. బాలానగర్ మండలం మోతీగణపూర్‌కు చెందిన కలీం రాత్రి 9:45 గంటల ప్రాంతంలో ఒంటిపై నిప్పంటించుకున్నాడు. భగభగ మంటలు మండుతుండగా పోలీస్ స్టేషన్‌లోకి వెళ్తూ ఆవరణలో పడిపోయా డు. అక్కడే ఉన్న డ్రైవర్ రాము కలీంపై పక్కనే ఉన్న సంపులో ఉన్న నీటిని పోసి మంటలు ఆర్పాడు. తీవ్రంగా గాయపడిన అతడిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నారు. భార్యాభర్తల మధ్య తగాదాలు, తల్లిదండ్రులతో గొడవల నేపథ్యంలో అంతకు గంట ముందే కలీం తల్లిదండ్రులపై ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళల రక్షణకే షీ టీమ్స్

- నారాయణపేట ఎస్పీ యోగేశ్‌గౌతమ్

నారాయణపేట, నవంబర్ 5 : మహిళలు, యువతులు, బాలికల రక్షణకే షీటీమ్స్ పని చేస్తుందని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మహిళలు ఆకతాయిలతో, మరే విధంగానైనా వేదింపులకు గురైతే నిర్భయంగా షీ టీమ్‌లను, పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేస్తామని పేర్కొన్నారు. షీటీమ్‌లను నేరుగా సంప్రదించలేనివారు 8712670398 నెంబర్ లేదా డయల్ 100ను సంప్రదించాలని సూచించారు.

పీయూలో సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 5 : పాలమూరు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీలో అడ్మిషన్ ఫీజు కింద రూ.1,800లు వసూలు చేస్తున్నారని, అంత డబ్బు చెల్లించలేని పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. మహిళా వసతిగృహం పూర్తయినా.. అందుబాటులోకి తీసుకురావడం లేదన్నారు. ఉన్న హస్టళ్లలో ఒక్కో గదిలో 8 నుంచి10 మంది విద్యార్థినులు సర్దుబాటు చేసుకోవాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. అనంతరం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ యూనివర్సిటీ అధ్యక్షుడు కృష్ణకుమార్, కార్యదర్శి శివకుమార్, సంయుక్త కార్యదర్శి నగేశ్, అకాడమిక్ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఆదిత్య, విష్ణువర్ధన్, సాయికృష్ణ, కేశవులు, సింధు ప్రియ, అనిత, పూజ, ప్రియాంక, కవిత, యామిని తదితరులు పాల్గొన్నారు.

పేట నుంచి అరుణాచలానికి బస్సు

నారాయణపేటరూరల్, నవంబర్ 5 : ఈనెల 15న కార్తీకపౌర్ణమిని పురస్కరించుకొని నారాయణపేట జిల్లా కేంద్రం నుంచి అరుణాచలంలో గిరిప్రదక్షిణ చేసే భక్తుల కోసం సూపర్‌లగ్జరీ బస్సును నడపనున్నట్లు పేట డీఎం లావణ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న సాయంత్రం 7 గంటలకు జిల్లా కేంద్రం నుంచి బయలుదేరి ఉదయం ఆంధ్రప్రదేశ్ కాణిపాకం వినాయకుని దర్శనం, వెలూరు మహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం 14న సాయంత్రం 7 గంటలకు అరుణాచలం చేరుకుంటుదని పేర్కొన్నారు. తిరిగి నవంబర్ 15న మధ్యాహ్నం 3 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 16న ఉదయం 8 గంటలకు పేటకు చేరుకొంటుందని తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.3,900లుగా చార్జీలను నిర్ణయించమని పేర్కొన్నారు. వివరాలకు 7382826109 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

దామరగిద్ద, నవంబర్ 5 : మండలంలోని వత్తుగుండ్లలో మంగళవారం ఓఎంఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మాజీ సర్పంచ్ రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రతి మహిళ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓఎంఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ హజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు శశికళ, వెంకటమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంలకు అవగాహన సదస్సు

నారాయణపేటరూరల్ నవంబర్ 5 : జిల్లా కేంద్రంలోని ఆదర్శ బీఈడీ కళాశాలలో ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన హెచ్ఎంకు మంగళవారం ఎస్సెస్సీ నామినల్‌రూల్స్, యూడైస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డీఈవో అబ్దుల్‌గని తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సెస్సీ నామినల్‌రూల్స్‌లో విద్యార్థి పేరు, తండ్రిపేరు, పుట్టినతేదీ, అధార్ నెంబర్లను జాగ్రత్తగా నింపాలన్నారు. ఎస్‌వో నాగార్జునరెడ్డి మాట్లాడుతూ యూడైస్‌లో పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థి పేరు, తండ్రిపేరు నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీజీ రాజేందర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థి అదృశ్యం : కేసు నమోదు


నందకుమార్ (ఫైల్)

నవాబ్‌పేట, నవంబర్ 5 : మండలంలోని మరికల్ హాస్టల్‌కు చెందిన నందకుమార్(12) అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హనుమాన్ టెంపుల్‌కు చెందిన నందకుమార్ 6నెలల కిందట మరికల్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి ప్రవేశం పొంది, బాలుర వసతిగృహంలో ఉంటున్నట్లు తెలిపారు. ఈనెల 4వ తేదీన హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, స్కూల్ బ్యాగ్ పాఠశాలలోనే వదిలి వెళ్లినట్లు తెలిపారు. హాస్టల్ వార్డెన్ నరేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్లపై పంట నూర్పిళ్లు చేస్తే చర్యలు

నవాబ్‌పేట, నవంబర్ 5 : రోడ్లపై పంటల నూర్పిళ్లు(కల్లాలు) చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై విక్రమ్ హెచ్చరించారు. నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు బీటీ రోడ్లపై పంటల నూర్పిళ్లు చేపట్టడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గ్రహించి, నూర్పిళ్లు చేపట్టవద్దని సూచించారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో వారి పెత్తనం ఏమిటీ ?

మరికల్, నవంబర్ 5 : ప్రభుత్వ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుల పెత్తనం చెలాయిస్తున్నారని, అధికారులు వారిని చూస్తు ఉన్నరని నారాయణ పేట జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి నర్సన్ గౌడ్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాల్లో లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులతో పత్రాలు ఇప్పించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు అధికారులు పెత్తనం ఇస్తుందన్నారు. అధికారులు అధికార దుర్వినియోగం చేయ్యడం తగదని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, రాజేశ్, రమేశ్, చెన్నయ్య, వెంకటేశ్, నరేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.